సాక్షి ఖమ్మం

సోమవారం । 17 । జూలై । 2023



'రుద్రమా' మేలుకో

భద్రాద్రి ఏజెన్సీలోని బాలికల విద్యాభ్యాసానికి ఆటంకాలు కలుగకుండా వాయిస్ ఫర్ గర్ల్స్ అనే స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. 8లో



అభివృద్ధిపై 'మీన'మేషాలు

జిల్లాలో ఏకైక చేప పిల్లల ఉత్పత్తి కేంద్రమైన వైరాలోని మత్స్య విత్తన కేంద్రం అభివృద్ధిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 10.40 గంటలకు ఖమ్మం నుంచి చింతకాని వెళతారు. అక్కడి రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశానికి హాజరై తిరిగి మధ్యాహ్నం 12.05 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. ఆ తర్వాత స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేయాలి

కలెక్టర్ వి.పి. గౌతమ్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్(ఫైల్)

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని, వాటి వివరాలను వాట్సప్ ద్వారా పంపాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సంవత్సరానికి జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణల్లో ప్రతిభ చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జరిగే స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా గ్రామీణ, విద్యార్థుల, వ్యవసాయ రంగ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలను ప్రదర్శించవచ్చని వివరించారు. వాటికి సంబంధించి రెండు నిమిషాల నిడివి గల వీడియో, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫొటోలు 9100678543 నంబర్‌కు ఆగస్టు 5లోగా వాట్సప్ ద్వారా పంపించాలని సూచించారు. వృత్తి, ఊరి పేరు, జిల్లా పేరు తదితర వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు.

ప్రవేశ పరీక్షకు 216 మంది హాజరు



ఖమ్మంమయూరిసెంటర్ : బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న సివిల్ సర్వీస్ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఎంపికకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 216 మంది అభ్యర్థులు హాజరయ్యారని బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ జి.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. కిట్స్ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్ష నిర్వహించామని పేర్కొన్నారు. మొత్తం 331 మంది అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోగా 60 శాతం మంది అభ్యర్థులు ప్రవేశ పరీక్ష రాశారని వెల్లడించారు.


బీఏఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

25న లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్ : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకానికి దరఖాస్తు గడువు పొడిగిస్తున్నట్లు డీడీ కస్తాల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో పథకం ద్వారా సీట్లు పొందేందుకు విద్యార్థులు ఈనెల 22 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 1వ తరగతి(డే స్కాలర్)లో ప్రవేశాలకు 128 సీట్లు ఉన్నాయని, 5వ తరగతి(రెసిడెన్షియల్)లో ప్రవేశాలకు 131 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు 1వ తరగతి ప్రవేశాల కోసం 314 మంది, 5వ తరగతిలో ప్రవేశాల కోసం 347 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. 25వ తేదీన ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో ఉదయం 11 గంటలకు 1వ తరగతికి, మధ్యాహ్నం 3 గంటలకు 5వ తరగతిలో ప్రవేశాలకు లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని వివరించారు.

అలరించిన 'అతీతం'

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి గుంటూరు కళాకారులు ప్రదర్శించిన 'అతీతం' నాటిక ప్రేక్షకులను అలరించింది. ప్రపంచీకరణ, గ్లోబలైజేషన్‌పై రూపొందిన ఈ నాటికకు ఎస్.రవీందర్ రెడ్డి దర్శకత్వం వహించారు. సమాజంలో డబ్బు వెనుక మనిషి పరుగు తీస్తుండగా, ఆ పరుగులో మానవీయ విలువలు మృగ్యమైపోతున్నాయనే ఇతివృత్తంతో ప్రదర్శించిన నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతినిధి ప్రసేన్, ప్రముఖ న్యాయవాది జాబిశెట్టి పాపారావు, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత, ఆర్ట్స్ సంస్థ అధ్యక్షులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ప్రజానాట్యమండలి ప్రతినిధులు నామా లక్ష్మీనారాయణ, వేముల సదానందం, రవీందర్, సాయి విశాల్, నందిగామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్నికల హడావుడి మొదలైంది. రాజకీయ పార్టీలు ఎన్నికల కోసం తమ అమ్ముల పొదిలోని అస్త్రశస్త్రాలు సిద్ధం చేస్తున్నాయి. ఇక ప్రధాన పార్టీల్లోని ఆశావహులు టికెట్లు చేజిక్కించుకునే మార్గాలు అన్వేషిస్తున్నారు. మరోవైపున ఈసీ కూడా ఎన్నికలకు సంబంధించిన పనులను ప్రారంభించింది. అలాగే, ఉమ్మడి జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, వామపక్షాలు ఇప్పటికే విమర్శల వాడిని పెంచాయి. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వార్ కొనసాగుతోంది. ఈసారి ఇక్కడ అత్యధిక స్థానాలు గెలుచుకునే దిశగా ఈ రెండు పార్టీలు గురి పెట్టాయి. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

సందడి షురూ!



ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన ఎన్నికల హడావుడి

- రాజకీయ పార్టీల్లో పెరుగుతున్న జోష్
- టికెట్ల కోసం ఆశావహుల ఆరాటం
- మరోవైపు ఏర్పాట్లలో నిమగ్నమైన ఎన్నికల సంఘం

పార్టీల్లో కోలాహలం

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీల కార్యాలయాలు కార్యకర్తలు, నాయకులతో కళకళలాడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల పర్యటనలు, సభలు ఊపందుకున్నాయి. ఇప్పటికే ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సభ ఖమ్మంలో నిర్వహించగా.. త్వరలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా సభ నిర్వహణకు బీజేపీ సన్నద్ధమవుతోంది. వీరి కన్నా ముందుగానే బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు ముఖ్యమంత్రి కేసీఆర్, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఇక మంత్రులు కూడా తరచూ జిల్లాలో పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లు కూడా వెలుస్తున్నాయి. వాల్‌రైటింగ్‌లు ప్రారంభించగా, మరి కొందరు గోడలను రిజర్వ్ చేసుకుంటున్నారు. టికెట్లు ఆశిస్తున్న నేతల్లో కొందరు క్యాంప్ కార్యాలయాలను ప్రారంభించారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారానికి కూడా పార్టీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ఎన్నికల సంఘం సమాయత్తం..

మరోవైపు ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఒక్కో పని చక్కదిద్దుతోంది. ఓటర్ల జాబితా తయారీ, సవరణ పూర్తయింది. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కేంద్ర ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకాన్ని పూర్తిచేసింది. ఇక అధికారుల బదిలీలూ మొదలయ్యాయి. ఒక్కో శాఖ అధికారులకు స్థానచలనం కలుగుతోంది. కొందరు సీఐ, ఎస్సైల బదిలీలు జరిగాయి. అలాగే ఖమ్మం జిల్లాలో ఇద్దరు ఆర్డీఓలను బదిలీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలెక్టర్, ఐటీడీఏ పీఓ, భద్రాచలం ఆర్డీఓను బదిలీ చేయగా.. ఖమ్మం అదనపు కలెక్టర్‌ను బదిలీ చేయడమే కాక మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ స్థానం మార్చారు. అయితే, ఈ బదిలీల ప్రక్రియ ముందు ముందు కూడా కొనసాగనుంది.

టికెట్ల పంచాయితీ..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రధాన పార్టీల్లో టికెట్లు ఆశిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంది. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లలో ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా.. మిగిలిన చోట్ల ఇద్దరు నుంచి నలుగురు వరకు టికెట్లను ఆశిస్తున్నారు. వీరందరూ తమ మార్గాల్లో టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే ఆయా పార్టీల అధినేతలు మాత్రం సర్వేలే ప్రామాణికం అని తేల్చడంతో ఆశావహుల్లో ఆందోళన మొదలైంది. సర్వేలో ఏం తేలుతుంది.. తమకు అనుకూలంగా వస్తుందా .. రాదా అనే ఆలోచనలతో సతమతం అవుతున్నారు. ఇప్పటి నుంచే పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను విజయవంతం చేసి అధినేతల దృష్టిలో పడేందుకు నానా పాట్లు పడుతున్నారు. టికెట్ రాని పక్షంలో ఏం చేయాలనే దానిపై ఇతరత్రా మార్గాలపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

అమ్మవారికి ఆషాఢ బోనం



ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అమ్మవార్లకు వైభవంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలు, డప్పు చప్పుళ్లతో గ్రామాల్లో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా కలగాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. – నెట్‌వర్క్

- వివరాలు 9లో

భూదాన్‌గుట్టపై పోలీస్ పికెటింగ్

ఖమ్మంఅర్బన్: నగరంలోని వెలుగుమట్ల రెవెన్యూ భూదాన భూములకు సంబంధించిన గుట్టపై పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. శనివారం ఆ ప్రాంతంలో వేలాది మంది గుడిసెలు వేసుకునేందుకు రాగా వారిని నిలువరించేందుకు పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మోహరించిన విషయం విదితమే. ఎట్టకేలకు పేదలు వేసిన గుడిసెలను అధికారులు జేసీబీల ద్వారా తొలిగించారు. ఈక్రమంలో గుడిసె వాసులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. మళ్లీ ఆ ప్రాంతంలో ఎలాంటి కదలికలు లేకుండా, అక్రమ నిర్మాణాలు చోటుచేసుకోకుండా శనివారం రాత్రి నుంచి వన్ ప్లస్ 4తో కూడిన పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

ఏం జరుగుతుందని ఆరా..

గుడిసెల కూల్చివేతల తర్వాత ఏం జరుగుతుందోనని గుడిసెలు వేసుకున్న పేదలు, తమ ప్లాట్ల హద్దు రాళ్లను తొలిగించి గుడిసెలు వేశారని కొందరు ప్లాట్ల యజమానులు ఆదివారం ఆ ప్రాంతానికి వచ్చి ఆరా తీశారు. అయితే ఎవరినీ అటువైపు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఇక శనివారం జిల్లా నలుమూలల నుంచి కర్రలు, ఇతర సామగ్రితో పేదలు తరలిరాగా, ఆ సామగ్రితో పాటు ఆటోలు, వ్యాన్‌లను ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషనకు తరలించారు. దీంతో స్టేషన్ ఆవరణ అంతా వాటితోనే నిండిపోయింది.



గుడిసెలు వేసిన ప్రాంతంలో పికెటింగ్ విధుల్లో ఎస్సై, కానిస్టేబుళ్లు

జిల్లాలో జోరువాన..

ఊపందుకుంటున్న వ్యవసాయ పనులు



ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం జిల్లా సగటు వర్షపాతం 10 మి.మీ.గా నమోదైంది. కూసుమంచి మినహా జిల్లాలోని 20 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా కామేపల్లి మండలంలో 41 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షాలు విస్తరిస్తుండటంతో వ్యవసాయ పనులు జోరందుకుంటున్నాయి. ఇప్పటికే సాగు చేసిన పత్తి, అపరాల పంటలకు ఈ వర్షాలు మేలు చేస్తున్నాయి. ఇక జిల్లాలో ప్రధాన పంటైన వరి సాగుకు సైతం ఈ వర్షాలు దోహదపడుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి నార్లు పోయడం, దుక్కులు సిద్ధం చేసి వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేయడం వంటి పనులు సాగుతున్నాయి. బోర్లు, బావుల కింద, నీటి వసరులున్న ప్రాంతాల్లో ముందుగా నార్లు పోసిన రైతులు మాగాణి భూములను దమ్ము చేసి నాట్లు వేస్తున్నారు. వర్షాలు ఊపందుకుంటే జలాశయాల్లోకి సమృద్ధిగా నీరు చేరే అవకాశం ఉంటుందని, తద్వారా వరిసాగు విస్తీర్ణం లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో 5 రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా వాతావరణ శాఖ తెలిపింది.

10 మి.మీ.కు పైగా వర్షపాతం నమోదైన మండలాలు

మండలం	వర్షపాతం
కామేపల్లి	41.0
బోనకల్	24.2
ఏన్కూరు	20.2
సింగరేణి	18.2
కొణిజర్ల	16.4
సత్తుపల్లి	11.8
ఖమ్మం అర్బన్	10.4

వైభవంగా రుద్రహోమం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం రుద్రహోమం పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అర్చకులు మాసశివరాత్రిని పురస్కరించుకుని రుద్రహోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను యాగశాలకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మండపారాధన, గణపతి పూజలు నిర్వహించిన అనంతరం చివరిగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అర్చకులు రవికుమార్ శర్మ, నర్సింహమూర్తితోపాటు ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, ఆలయ కమిటీ సభ్యులు చింత నాగరాజు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణపుష్పార్చన

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామి వారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామి వార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు.

'పాలేరు'కు జలకళ

- 17 అడుగులకు చేరిన నీటిమట్టం
- తాగునీటి సరఫరాకు ఢోకా లేనట్టే..



సాగర్ జలాల రాకతో కళకళలాడుతున్న రిజర్వాయర్

కూసుమంచి : పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ నీరు చేరుకోవడంతో జలకళ సంతరించుకుంది. ఇటీవల రిజర్వాయర్ నీటిమట్టం 10 అడుగులకు పడిపోవడంతో కూసుమంచి మండలంలోని 74 గ్రామాలకు అధికారులు తాగునీటి సరఫరా కూడా నిలిపివేశారు. దీంతో జిల్లా జలవనరుల శాఖ అధికారులు.. సాగర్ నీరు విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఆ వినతికి స్పందించిన ప్రభుత్వం సాగర్ నుంచి టీఎంసీ నీటిని కేటాయించింది. ఆదివారానికి నీరు చేరుకోవడంతో ప్రస్తుతంనీటి మట్టం 17 అడుగులకు పెరిగింది. ప్రస్తుతం రిజర్వాయర్‌కు సాగర్ నుంచి 3,952 క్యూసెక్కుల నీరు చేరుతోంది.

తాగునీటికి భరోసా..

పాలేరుకు సాగర్ జలాలు చేరుతుండటంతో తాగునీటికి భరోసా ఏర్పడింది. పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 23 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 17 అడుగులకు చేరుకుంది. సాగర్ జలాలు వస్తుండటంతో మరో నాలుగైదు రోజుల్లో పూర్తిస్థాయికి చేరనుంది. దీంతో మరికొన్ని నెలల పాటు తాగునీటికి ఇబ్బందులు తీరనున్నాయి. రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ ప్రాజెక్టుకు రోజుకు 125 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తుండగా, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు గ్రామాలు, నగరాలకు తాగునీటిని అందిస్తున్నారు. ఇక పాలేరు, గురువాయిగూడెం వద్ద నిర్మించిన పాత ప్రాజెక్టుల ద్వారా కూసుమంచి మండలంలోని మరో 74 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ పథకం ఇన్‌టేక్ వెల్‌లో పూడిక పేరుకుపోవడంతో నీరు అందక వారం పాటు సరఫరా నిలిపివేయగా పూడిక తీసిన అనంతరం ఆదివారం నుంచి నీరు వదులుతున్నారు.

మెనూ.. మారుతోంది!

- బీసీ, ఎస్టీ వసతిగృహాల్లో అల్పాహారంగా ఇడ్లీ, చపాతి, పూరీ
- ఎస్సీ హాస్టల్‌లో మాత్రం రైస్ ఐటమ్‌తోనే సరి
- కనిపించని ఆదివారం ప్రత్యేకత
- ఎందుకీ వివక్ష అంటున్న విద్యార్థులు



ఎస్సీ కళాశాల వసతిగృహంలో ఆదివారం అల్పాహారంగా తయారుచేసిన బగారా రైస్



బీసీ హాస్టల్‌లో ఇడ్లీ వడ్డిస్తున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్ : ఇంటికి, తల్లిదండ్రులకు దూరంగా ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం సకల సౌకర్యాలతో పాటు నాణ్యమైన భోజనం అందించేందుకు నిధులు ఖర్చు చేస్తోంది. కులాల వారీగా సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసినప్పటికీ అందరినీ ఒకేలా చూసేందుకు సమానంగా నిధులు కేటాయిస్తోంది. మెస్ చార్జీలు కూడా అన్ని శాఖలకు ఒకేరకంగా అందిస్తున్నప్పటికీ.. వసతిగృహాల సంక్షేమాధికారుల నిర్లక్ష్యంతో ఒక్కో శాఖ విద్యార్థులకు ఒక్కో రకమైన భోజనం, టిఫిన్లు పెడుతున్నారు. జిల్లాలో ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాలు నిర్వహిస్తుండగా.. మెనూలో తేడా ఉంటోంది.

ఎస్సీ వసతిగృహాల్లో కనిపించని ప్రత్యేకత..

సంక్షేమ వసతిగృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు రోజూ ఒకే రకమైన భోజనం పెట్టకుండా కొన్ని మార్పులు చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచిస్తోంది. ఆదివారం ప్రత్యేకంగా ఉదయం ఇడ్లీ, పూరి, చపాతి వంటి అల్పాహారం, మధ్యాహ్నం చికెన్ కర్రీతో బగారా రైస్, సాయంత్రం కూరగాయల భోజనం అందించేలా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వసతిగృహాల్లో మెనూ అమలు చేస్తుంటారు. అయితే జిల్లాలోని ఎస్సీ వసతిగృహాల్లో మాత్రం ఆ ప్రత్యేకత కనిపించడం లేదు. బీసీ వసతిగృహాల్లో ఇడ్లీ అందిస్తుండగా, ఎస్టీ హాస్టళ్లలో ఒక వారం పూరి, మరో వారం చపాతి అల్పాహారంగా అందిస్తున్నారు. ఎస్సీ వసతిగృహంలో మాత్రం ప్రతి రోజు బియ్యంతో తయారుచేసిన ఐటమ్‌నే టిఫిన్‌గా పెడుతున్నారు.

జిల్లాలో శాఖల వారీగా కళాశాల వసతిగృహాల వివరాలు..

శాఖ	వసతిగృహాలు	విద్యార్థులు
ఎస్సీ	11	783
ట్రైబల్	11	1914
బీసీ	11	1011

ఒక్కో విద్యార్థికి రూ.1500

ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులకు ఒక్కొక్కరికి మెస్ చార్జీల కింద ప్రభుత్వం రూ.1500 చొప్పున కేటాయిస్తోంది. ఈ చార్జీల ఆధారంగా జిల్లా మెనూ కమిటీ విద్యార్థులకు అందించాల్సిన అల్పాహారం, భోజనంపై మెనూ తయారు చేసి జిల్లా అధికారులు, కలెక్టర్ అనుమతి పొందుతారు. ఆ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి. దీని ప్రకారం ఎస్సీ వసతిగృహాల్లో ఆదివారం ఉదయం అల్పాహారంగా ఇడ్లీ అందించాల్సి ఉండగా.. గతేడాది నుంచి టమాట రైస్ అందిస్తున్నట్లు మెనూలో పొందుపరిచారు. దీంతో ఎస్సీ కళాశాల వసతిగృహ విద్యార్థులకు 'సండే స్పెషల్' లేకుండా పోయింది. మెనూలో ఉన్న ఐటమ్స్ తమకు అందించడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. రైస్ మెత్తగా వండుతున్నారని, ఆ భోజనం చేయలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

ఈసారైనా మెనూ మార్చేనా..?

సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచుతున్నట్లు బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటి వరకు అవి పెరగలేదు. ఎప్పటిలాగే ఒక్కొక్కరికి నెలకు రూ.1500 అందజేస్తోంది. ఈ చార్జీల ఆధారంగానే ఈ విద్యా సంవత్సరంలో కొత్త మెనూ తయారు చేయాలి. ఇప్పటికే జిల్లా అధికారులు సంక్షేమ వసతిగృహాలకు అవసరమైన సరుకులను సరఫరా చేసేందుకు ధరలను నిర్ణయించి, టెండర్లను ఖరారు చేశారు. వాటి ఆధారంగా జిల్లా కమిటీ మెనూ తయారు చేయాలి. అయితే ఈ ఏడాది నుంచైనా ఎస్సీ వసతిగృహాల్లో ఆదివారం ప్రత్యేక మెనూ అమలు చేస్తారా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీసీ, ఎస్టీ హాస్టళ్లలో వలె తమకు కూడా ఆదివారం అల్పాహారంగా ఇడ్లీ, పూరి, చపాతి పెట్టాలని విద్యార్థులు కోరుతున్నారు. నేడో.. రేపో సమావేశం కానున్న మెనూ కమిటీ దీనిపై దృష్టి సారించాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

ఇడ్లీ పెట్టేలా చూస్తాం..

ఎస్సీ కళాశాల వసతిగృహాల్లో ఇకపై ప్రతి ఆదివారం ఇడ్లీ పెట్టేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం అందిస్తున్న గుడ్లకు అదనంగా మరో గుడ్డు పెట్టేలా మెనూ తయారు చేయిస్తాం. మెనూ ప్రకారం ఏ రోజు ఏం పెట్టాలో అదే అందించాలి. మెనూ సక్రమంగా అమలు చేయకుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– కస్తాల సత్యనారాయణ, ఎస్సీడీడీ

క్లుప్తంగా

కవిత్వం నిరంతర యుద్ధం

'యుద్ధం ముగిసిపోలేదు' పుస్తకావిష్కరణలో విమర్శకుడు లక్ష్మీనరసయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

ఖమ్మంగాంధీచౌక్: సమాజ మార్పునకై చేసే యుద్ధం ఎప్పటికీ ముగింపులేనిదని అనుభూతి, ఆలోచనలను సమతుల్యం చేసుకుంటూ వెళ్లటమే కవికి ఉండాల్సిన ప్రధాన లక్షణమని ప్రముఖ విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని వెలాసిటీ జూనియర్ కళాశాలలో జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గద్దపాటి శ్రీనివాస్ రచించిన 'యుద్ధం ముగిసిపోలేదు' పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ.. ఖమ్మం సాహిత్య రంగాన్ని శాసిస్తున్న తీరు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కవులు, రచయితలు తాము రాసే వ్యాక్యాన్ని అంటిపెట్టుకొని ఆచరణలో పాటిస్తే సమాజాన్ని ఉన్నతంగా దర్శించగలుగుతామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కవులు, రచయితలు, విశ్లేషకులు మాట్లాడుతూ.. గద్దపాటి శ్రీనివాస్ తన కవిత్వంలో చూపిన పరిపక్వత ఆశ్చర్యం, ఆనందం కలిగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు కన్నెగంటి వెంకటయ్య, లెనిన్ శ్రీనివాస్, పగడిపల్లి వెంకటేశ్వర్లు, నామా పురుషోత్తం, రమేశ్, అమృతవర్షిణి, జయరాజు, అట్లూరి వెంకటరమణ, వురిమళ్ల సునంద తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఆర్డీఓ బదిలీ

మొబైల్ కోర్టు న్యాయమూర్తిగా కిషోర్ రాక!



ఎల్.కిషోర్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్డీఓగా విధులు నిర్వర్తిస్తున్న రత్నకల్యాణి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది నవంబర్ 18న భద్రాచలం ఆర్డీఓగా ఆమె బాధ్యతలు చేపట్టి 9 నెలలు పాటు పనిచేశారు. అలాగే, భద్రాచలం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్, మొబైల్ కోర్టు న్యాయమూర్తిగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎల్.కిషోర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయన ఇక్కడికి రావడానికి సుముఖంగా లేరని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చింతకాని: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన రాజేశ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కథనం ప్రకారం.. రాజేశ్ నాగులవంచ గ్రామం నుంచి కొత్త వెంకటేశ్వరస్వామి దేవాలయం రహదారి మీదుగా నర్సింహాపురం గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. రహదారిపై ఉన్న పెద్దమట్టికుప్పను గమనించకుండా ఢీకొట్టి కిందపడిపోయాడు. దీంతో రాజేశ్ తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. రైల్వే మూడో లైను వేస్తున్న క్రమంలో మట్టితో వెళ్తున్న లారీ దెబ్బతినడంతో నిర్లక్ష్యంగా మట్టిని రహదారిపై కుప్పగా పోసి వెళ్లారు. దీంతో రహదారిపై వెళ్తున్న వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన హోంగార్డు సైదులు

కూసుమంచి: ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక హోంగార్డుతో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని హట్యాతండాకు చెందిన హోంగార్డు సైదులు డ్యూటీకి ఖమ్మం వెళ్లేందుకు బస్సు కోసం రహదారి పక్కన ఎదురు చూస్తున్నాడు. అతడిని ఖమ్మం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఇదిలాఉండగా హైదరాబాద్ నుంచి ఖమ్మం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బాసర శ్రీకాంత్‌ను కూడా కారు ఢీకొట్టడంతో ఇరువురు తీవ్ర గాయాల పాలయ్యారు. వారిని 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఎనిమిది మందిపై కేసు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో ఎనిమిది మందిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇంటి స్థలం, పెంటదిబ్బ విషయంలో అన్నదమ్ములైన తుడుం వెంకయ్య, రాజేశ్ మధ్య శనివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఇరువురి కుటుం బసభ్యులు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పొదిల వెంకన్న ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

వేంసూరు: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక శనివారం నుంచి కనిపించకపోవడంతో బాలిక తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'రుద్రమా' మేలుకో

లింగ సమానత్వంలో నేటికీ వివక్షే

- ఏజెన్సీలో సైతం సమాన అవకాశాలు తక్కువే
- సమానత్వ స్పృహ పెంచుతున్న స్వచ్ఛంద సంస్థలు
- భద్రాద్రి ఏజెన్సీలో వాయిస్ ఫర్ గర్ల్స్ ప్రయత్నాలు



ఏజెన్సీ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమంలో పాల్గొంటున్న విద్యార్థినులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారతదేశపు తొలి మహిళా రాణిగా పేరొందిన రుద్రమదేవి తన జీవితంలో సగం కాలం తన గుర్తింపు దాచుకునే బతికింది. మహిళగా పుట్టినా.. కాకతీయ వారసుడు పురుషుడే అంటూ లోకాన్ని నమ్మించాల్సి వచ్చింది. పాలనపై పట్టు చిక్కిన తర్వాతే తానొక మహిళగా లోకానికి పరిచయం చేసుకుంది. ఇది పదమూడో శతాబ్దంలో చోటు చేసుకున్న సంఘటన. ఆ కాలంలో స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు లేక ఇలా జరిగిందనే భావన ఉండొచ్చు. కానీ.. వందల ఏళ్లు గడిచినా, సరికొత్త రాజ్యాంగాలు రాసుకున్నా, ప్రజాస్వామ్యమనే పేరుపెట్టుకున్నా నేటికి స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు కల్పించే విషయంలో ఆశించిన మార్పు రాలేదు. ఇందుకు భానుమతి ఘటనే ఉదాహరణ. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతానికి చెందిన భానుమతి ఎనిమిదో తరగతి చదివేప్పుడు 'పెద్దయ్యాక నువ్వేం అవుతావ్' అని టీచర్లు అడిగితే 'జిల్లా ఎస్పీ అవుతా' అంటూ నమ్మకంగా చెప్పింది. పదో తరగతికి వచ్చే సరికి 'ఆడపిల్లలు ఐఏఎస్, ఐపీఎస్ అంటూ దేశాలు పట్టుకు తిరిగితే కుదరదు.. ఇక్కడే ఉంటూ కానిస్టేబుల్ అయితే చాలని ఊరి జనాలు సర్దిచెప్పారు. చివరకు ఇంటర్ దాటకుండానే ఆమెకు పెళ్లి ప్రయత్నాలు మొదలెట్టారు ఇంట్లో వాళ్లు. కళ్లెదుటే కన్న కలలన్నీ కూలిపోతుంటే సాయం కోసం 'వాయిస్ ఫర్ గర్ల్స్' సంస్థను ఆశ్రయించింది భాను. రంగంలోకి దిగిన పోలీసులు బాల్య వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా ఆ అమ్మాయి చదువుకునేందుకు అండగా నిలిచారు. ఇప్పుడు తాను కన్న కలలు సాకారం చేసుకునే పనిలో ఉంది భానుమతి.

సమానత్వమంటే..

సామాజిక, ఆర్థిక పరిస్థితులను బట్టి సమానత్వం నిర్వచనం మారుతుంటుంది. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన, ఏజెన్సీ ప్రాంతాల్లో పురుషులతో పోల్చితే మహిళలపై కట్టుబాట్లు ఎక్కువ. ఏ సమస్య వచ్చినా ముందుగా సర్దుకుపోవాల్సిన బాధ్యత కుటుంబంలోని మహిళలు, బాలికలపైనే ఉంటుంది. ఇక్కడి స్త్రీల జీవితాల్లో సమానత్వం కోసం పని చేస్తోంది వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ.

మూడు విధాలుగా

వాయిస్ ఫర్ గర్ల్స్ తమ కార్యక్రమాలను మూడు దశల్లో అమలు చేస్తోంది. ముందుగా పరిచయ్, ఆ తర్వాత దిశ, చివరగా సఖిగా వీటిని విడగొట్టింది. పరిచయ్‌లో భాగంగా వివిధ వయసుల్లో స్త్రీ శరీరంలో వచ్చే మార్పులు, సృష్టిలో వాటి ఆవశ్యకతను తెలియజేస్తూ సామాజికంగా గూడుకట్టుకున్న అపోహలను దూరం చేస్తుంది. రాజ్యాంగం స్త్రీలకు కల్పించిన హక్కులు, మహిళా రక్షణ కోసం చేసిన చట్టాలను వివరిస్తుంది. వీటితో పాటు రకరకాల కారణాలతో చదువు మధ్యలో ఆగిపోకుండా ఉన్న మార్గాలను పరిచయం చేస్తుంది. ఆ తర్వాత దశలో గృహహింస జరిగే తీరు, వరకట్న వేధింపులు, అత్తామామల దౌర్జన్యాలు, లైంగిక హింస, మాటలతో మానసికంగా హింసించడం, ప్రేమించకపోతే చనిపోతానంటూ భావోద్వేగాలతో రెచ్చగొట్టే చర్యల పట్ల తమను తాము ఎలా రక్షించుకోవాలో బాలికలకు అవగాహన కల్పిస్తోంది.

పాఠశాల స్థాయి నుంచే టీమ్..

మహిళల రక్షణకోసం అనేక టోల్‌ఫ్రీ నంబర్లు ఉన్నా అంచనాలకు తగ్గస్థాయిలో ఫలితాలు రావడంలేదు. నేరుగా తమ వివరాలు చెప్పి సమస్యకు పరిష్కారం కోరేందుకు చాలా మంది మహిళలు వెనుకడుగు వేస్తుంటారు. ఈ సమస్యను అధిగమించేందుకు వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ పాఠశాల స్థాయి నుంచే పటిష్టమైన టీమ్ ఏర్పాటు చేస్తోంది. తమ అవగాహన కార్యక్రమాల్లో సఖి దశకు చేరుకున్న విద్యార్థులతో పాఠశాల స్థాయిలో నలుగురు లీడర్లు, ఒక మేనేజర్ మొత్తం ఐదుగురితో టీమ్ ఏర్పాటు చేస్తోంది. వీరు ఆ పాఠశాల స్థాయిలో ఎవరికి సమస్య వచ్చినా ఈ టీమ్ సభ్యులు వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థకు చేరవేస్తారు. అక్కడి నుంచి సమస్యకు తగు పరిష్కారం చూపించే దిశగా ప్రభుత్వ విభాగాలు క్షేత్రస్థాయిలో ముందుకు కదులుతాయి.

సఖి స్టేజ్‌కు 1400 మంది..

గత రెండేళ్లలో జిల్లాలో 1400 మంది బాలికలు సఖి స్టేజ్‌కు చేరుకున్నారు. ఏజెన్సీలో అనేక పాఠశాలల్లో ముఖ్యంగా గిరిజనులు ఎక్కువగా ఉండే స్కూళ్లలో వాయిస్ ఫర్ గర్ల్స్ టీమ్‌లు పని చేస్తున్నాయి. అలాంటి ఓ టీమ్ చూపిన చొరవ కారణంగానే భానుమతి బాల్య వివాహం మధ్యలోనే ఆగిపోయింది. తల్లిదండ్రులను నచ్చజెప్పి భాను పై చదువులకు వెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు జరిగాయి. సామాజిక అడ్డంకులను దాటుకుంటూ చిన్నప్పుడు తాను కన్న కలను నిజం చేసుకునే పనిలో భానుమతి ప్రస్తుతం బిజీగా ఉంది. 13వ శతాబ్దం రుద్రమదేవిలా సమాన హక్కుల కోసం మగాడిగా గుర్తింపును మార్చుకోకుండా ఓ స్త్రీగానే తన కలలను సాకారం చేసుకునేందుకు బాటలు వేసుకుంటోంది.

సామాజిక దృక్పథంతో పనిచేయాలి

- పరిశోధనల వైపు దృష్టి సారించాలి
- అనస్తీషియన్ల రాష్ట్రస్థాయి ముగింపు సదస్సులో వక్తలు



రాష్ట్రస్థాయి సదస్సులో పాల్గొన్న మత్తు వైద్య నిపుణులు

ఖమ్మంఅర్బన్: వైద్యాన్ని వ్యాపార కోణంలో కాకుండా సామాజిక దృక్పథంతో చూడాలని పలువురు వక్తలు కోరారు. మత్తు వైద్యులు పరిశోధనల వైపు దృష్టి సారించి భవిష్యత్‌లో వచ్చే వ్యాధులకు వైద్యం అందించే విధంగా ముందుకు సాగాలని కోరారు. ఆదివారం మమత ఆస్పత్రిలోని పువ్వాడ ఆడిటోరియంలో అనస్తీషియన్ల ఎనిమిదో రాష్ట్రస్థాయి ముగింపు సదస్సులో పలువురు మాట్లాడారు. వైద్య రంగంలో మత్తు వైద్యుల పాత్ర ముఖ్యమైనదని, వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా.. భవిష్యత్‌లో వచ్చే కొత్త వ్యాధులకు సైతం వైద్యం అందించేలా మార్పు సాధించాలని, పరిశోధనలవైపు దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్‌లోనూ ఖమ్మం కేంద్రంగా ఇలాంటి సదస్సులు జరగాలని ఆకాంక్షించారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు వైద్యాన్ని అందించేలా తమవంతు పాత్ర పోషించాలని, వైద్యాన్ని వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక స్పృహతో చూడాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న వైద్యులు మానవతా దృక్పథంతో పనిచేయాలని కోరారు. అనంతరం ఐఎస్‌ఏ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బాగం కిషన్‌రావు మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 800 మంది వైద్యులు పాల్గొన్నారని తెలిపారు. కాగా, సమావేశంలో అతిథులకు మెమెంటోలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఐఎస్‌ఏ జాతీయ కార్యదర్శి డాక్టర్ సుక్మిందరిత్‌సింగ్, ఆట్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రత్నాకర్, డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, సెక్రటరీ డాక్టర్ టి.సురేశ్, చైర్మన్ రవి, ఎం.వెంకటేశ్వరరావు, మమత ఆస్పత్రి ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, ఐఎస్‌ఏ సభ్యులు చింతల కిషన్, పంకజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టాలి

ఎమ్మెల్యే రాములునాయక్, ఎమ్మెల్సీ తాతా మధు



వైరాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: రైతుల వ్యవసాయానికి 3 గంటల ఉచిత విద్యుత్ చాలన్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన దొంగ రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. 24 గంటల విద్యుత్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇచ్చామని చెబుతున్న సీఎల్‌పీ నేత మల్లు భట్టి విక్రమార్క వైరా రింగ్ రోడ్డు సెంటర్‌లో బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. రైతులను చులకన చేసి మాట్లాడిన రేవంత్‌రెడ్డి తప్పును కప్పి పుచ్చుకోవడానికి టీఆర్‌ఎస్ నాయకులపై బూతు పురాణానికి దిగుతున్నాడని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక అవాకులు చెవాకులు పేలుతున్నారని చెప్పారు. సోమవారం నుంచి 10 రోజుల పాటు ప్రతి రైతు వేదికలో జరిగే సమావేశాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఆయా మండలాల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, యంత్రప్రగడ చిరంజీవి, బాణోత్ సురేశ్, సతీశ్‌బాబు, ఉమాశంకర్, ఎంపీపీలు వేల్పుల పావని, మాలోత్ శకుంతల, జెడ్పీటీసీ కనకదుర్గ, వివిధ మండలాల బీఆర్‌ఎస్ నాయకులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్‌లు, పాల్గొన్నారు.

మోసం చేసిన నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ రామానుజం

కల్లూరు: బంగారానికి మెరుగు పెడతామని బురిడీ కొట్టించిన ఇద్దరు నిందితులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీపీ రామానుజం వివరాలు వెల్లడించారు. కల్లూరు పట్టణం శాంతినగర్‌కు చెందిన ఖమ్మంపాటి రమాదేవి ఇంటికి ఈ నెల 10వ తేదీన బంగారానికి మెరుగు పెడతామంటూ ఇద్దరు వ్యక్తులు వచ్చారు. మాయమాటలు చెప్పి ఆమె పుస్తెలతాడును యాసిడ్‌లో ముంచి కొంత మేరకు కరిగించి, తిరిగి పసుపు పూసి ఇచ్చారు. గంట వరకు బయటకు తీయొద్దని చెప్పి వెళ్లారు. రమాదేవి గంట తరువాత బయటకు తీసి చూడగా బరువు తగ్గిందని అనుమానం వచ్చి స్థానిక జ్యూయలరీ దుకాణంలో తూకం వేయించగా 40 గ్రాముల గొలుసు కేవలం 14 గ్రాములే ఉందని తేలింది. తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ రఘు ఆదివారం ఉదయం కల్లూరు మండలం లింగాలలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారే సదరు మహిళను మోసం చేసినట్లు గుర్తించారు. వారిని బిహార్‌కు చెందిన చికోకుమార్, చోటుకుమార్‌గా తేల్చారు. వారిద్దరిపై ఆంధ్రప్రదేశ్‌లో ఇదే తరహా కేసులు నమోదై ఉన్నాయని ఏసీపీ వెల్లడించారు. కార్యక్రమంలో సత్తుపల్లి రూరల్ సీఐ హనూక్, ఎస్‌ఐ రఘు, ఏఎస్‌ఐ పుల్లారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాదారుల మధ్య వాగ్వాదం

- ఓ వర్గం యువకుల దాడి
- మహిళకు తీవ్ర గాయాలు




మహిళపై దాడి చేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: మండలంలోని గోపాలపురం వద్ద ఇరు కుటుంబాల మధ్య స్వల్ప వివాదం జరగగా ఓ కుటుంబానికి చెందిన యువకుడు తన స్నేహితులతో కలిసి గంజాయి మత్తులో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఖమ్మం – వైరా ప్రధాన రహదారిపై పువ్వాడ అజయ్‌నగర్ ఆర్చి వద్ద దుకాణాలు నిర్వహించే ఓ రెండు కుటుంబాల మధ్య శనివారం రాత్రి స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఈ ఘటనను దృష్టిలో పెట్టుకుని ఓ కుటుంబానికి చెందిన యువకుడు కొద్దిమంది స్నేహితులతో కలిసి కర్రలు, రాళ్లతో విధ్వంసం సృష్టించారు. గంజాయి మత్తులో ఉన్న వారంతా రహదారి పక్కన ఉన్న పలు దుకాణాలపై దాడి చేసి ధ్వంసం చేశారు. వివాదం జరిగిన కుటుంబానికి చెందిన వివాహిత కవితపై దాడి చేశారు. ఆమె కుమారులపైనా దాడి చేసే ప్రయత్నం చేయడంతో కవిత కాళ్లుపట్టుకుని వేడుకోవడంతో వదిలేశారు. కొద్ది సేపటి తర్వాత కవిత స్పృహ తప్పి పడిపోగా ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలో రహదారిపై ఆపిన ద్విచక్రవాహనదారులపైనా వారు దాడి చేశారు. అక్కడ ఉన్న ఓ కారు అద్దాలను ధ్వంసం చేశారు.

పత్రిక విలేకరిపై దాడి..

గొడవ జరుగుతున్న క్రమంలో ఖమ్మం వైపు వస్తున్న ఓ దినపత్రిక విలేకరి ఉపేందర్.. డివైడర్ పైకి ఎక్కి పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడ ఉన్న ఓ వ్యక్తి విలేకరి ఫోన్ తీసుకొని ధ్వంసం చేయగా మరొకరు దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న ఖానాపురం హవేలి పోలీసులు అక్కడికి చేరుకోవడంతో దుండగులు పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి మనోజ్, అతడి స్నేహితుల్లో ఇద్దరు తనపై దాడి చేశారంటూ ఉపేందర్ హవేలి సీఐ శ్రీహరికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

వనజీవి రామయ్య కుమారుడు మృతి



నివాళులర్పిస్తున్న రాయల నాగేశ్వరరావు



సైదులు (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య ప్రథమ కుమారుడు దరిపల్లి సైదులు (47) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత బెల్లం వేణు, అశోక్‌నాయక్, టి.వీరారెడ్డి, భుజంగరెడ్డి సైదులు మృతదేహానికి నివాళులర్పించారు. కాగా, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైదులు మృతికి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని ఓ వివాహిత ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని.. చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లికి చెందిన దోసపాటి లక్ష్మి (42) ఈ నెల 13న వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. తీవ్ర గాయాలపాలైన లక్ష్మిని ఖమ్మంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని కొండాపురానికి చెందిన బడేటి మల్లయ్య (50) మద్యానికి బానిసై పురుగు మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మల్లయ్య కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో ఘర్షణ పడుతున్నాడు. మద్యం మానాలని ఎంత చెప్పినా వినకుండా రోజూ మద్యం తాగి ఇంటికి వస్తున్నాడు. ఈ నెల 15న ఇంటి నుంచి చేనుకు వెళ్లిన మల్లయ్య అక్కడ పురుగుమందు తాగగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించా రు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

20.8 కేజీల గంజాయి పట్టివేత



గంజాయి, నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు


ఖమ్మంక్రైం: నగరంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆదివారం ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ రాజు ఆధ్వర్యంలో 10 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా బెజగుడాకు చెందిన గణేశ్‌కబాసి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేజీ గంజా రూ.2,500 చొప్పున కొని రూ.15 వేలకు విక్రయిస్తున్నాడని సీఐ రాజు వెల్లడించారు. తనిఖీల్లో ఎస్‌ఐ షేక్ రబ్బానీ, సిబ్బంది రవి, శశికాంత్, శ్రీనివాసరెడ్డి, రమేశ్, లలిత, రమ, మారేశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

పెనుబల్లి: బస్సులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ శాఖ ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. రెండు రోజులుగా పెనుబల్లిలోని జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తున్న సత్తుపల్లి, వైరా ఎక్సైజ్ సిబ్బంది.. ఆదివారం కుంట నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపి తనిఖీ చేశారు. తమిళనాడు రాష్ట్రం మదురైకి చెందిన ఇద్దరు యువకుల బ్యాగుల్లో 10.8 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సత్తుపల్లి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. తనిఖీల్లో వైరా ఎక్సైజ్ సీఐ వి.రమ్య, సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు, ఎస్‌ఐలు అల్లూరి సీతారామరాజు, కిరీటి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బతుకుదెరువు కోసం వచ్చి..

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో బాలాజీనాయక్ మృతదేహం

మఠంపల్లి: బతుకుదెరువు కోసం మఠంపల్లి మండలానికి వలస వచ్చిన వ్యక్తి ఆదివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అజయ్‌తండాకు చెందిన బానోతు బాలాజీనాయక్(56), సుగుణ దంపతులకు నలుగురు కుమార్తెలు ఉండగా అందరికీ వివాహం చేశారు. దంపతులు రెండేళ్ల కిందట మఠంపల్లి మండలంలోని కాల్వపల్లితండాలో గల తమ బంధువుల వద్దకు వచ్చి ఇక్కడే భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతిరోజు ఇద్దరూ తమ టీవీఎస్ మోపెడ్‌పై కాల్వపల్లితండా నుంచి మఠంపల్లికి వచ్చి కూలి పనులు చేసుకుని ఇంటికి వెళ్తుంటారు. రోజుమాదిరిగా ఆదివారం సాయంత్రం కూడా మఠంపల్లిలో పనులు ముగించుకుని టీవీఎస్ మోపెడ్‌పై దంపతులు కాల్వపల్లి తండాకు బయల్దేరారు. ఈ క్రమంలో మఠంపల్లి మండలకేంద్రం సమీపంలోని మోడల్‌స్కూల్ వద్ద బొలేరో వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీనాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమివ్వడంతో గాయపడిన సుగుణను చికిత్స నిమిత్తం, బాలాజీనాయక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు. అయితే బొలేరో వాహనం డ్రైవర్ మద్యం మత్తులో టీవీఎస్ మోపెడ్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడని స్థానికులు చెబుతున్నారు.

బొప్పాయి మొక్కల లోడు లారీ పల్టీ

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ సమీపంలో ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రహదారిపై బొప్పాయి మొక్కల లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు ఆదివారం పల్టీ కొట్టింది. ఈ లారీ రాజమండ్రి నుంచి రఘునాథపాలెం మండలం సూర్యాతండాకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని, ఎవరికీ గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. వేలాది రూపాయలతో కొనుగోలు చేసి తరలిస్తున్న మొక్కలన్నీ ధ్వంసమయ్యాయని వారు చెప్పారు.

మద్యం దుకాణంలో ఘర్షణ

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని ఓ మద్యం దుకాణంలో ఆదివారం సాయంత్రం ఘర్షణ చోటుచేసుకుంది. ఒక వ్యక్తిపై ఐదుగురు వ్యక్తులు బీరు సీసాలతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మంరూరల్ మండలం పెద్దతండాకు చెందిన క్రేన్ ఆపరేటర్ తేజావత్ రమేశ్ రఘునాథపాలెం మండలం పరికలబోడుతండాలో అత్తగారి ఇంటికి వచ్చాడు. మద్యం కోసం దుకాణానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ మద్యం మత్తులో ఉన్న ఖమ్మం నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రవీణ్, వేణు, విజయ్‌కుమార్, నవీన్, విజయ్‌లు కావాలని ఘర్షణ పడి తనపై దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి,

ఉరకలేస్తున్న గోదావరి



ధవళేశ్వరం: తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ఉరకలేస్తోంది. పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాలతో బ్యారేజీ వద్దకు వచ్చి చేరుతున్న వరద నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 9.70 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 1,25,693 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. నీటిమట్టం ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద 14 అడుగులకు, పోలవరంలో 27.67 మీటర్లకు చేరింది.

బంగాళాఖాతంలో 18న మరో ఉపరితల ఆవర్తనం

సాక్షి, హైదరాబాద్: వాయువ్య బంగాళాఖాతంలో ఈ నెల 18న మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలోని ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్‌లో అల్పపీడనం ఏర్పడినట్లు చెప్పింది. రానున్న రెండు రోజుల్లో దక్షిణ వాయవ్య దిశలో ఝార్ఖండ్ మీదుగా కదిలే అవకాశం ఉన్నట్లు వివరించింది. దీంతో రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వెల్లడించింది.

డ్రోన్ సాగు సూపర్!

▶ మొదటి పేజీ తరువాయి

సేకరించడానికి వీలుగా డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. డ్రోన్లను సరైన తీరులో వినియోగించడం ద్వారా.. సాగులో పురుగు మందులు, ఎరువుల వృథాను అరికట్టవచ్చని, కూలీల కొరతకు చెక్‌పెట్టవచ్చని వర్సిటీ అధికారులు చెప్తున్నారు.

వరిలో విత్తనాలు వెదజల్లేలా..

డ్రోన్ల ద్వారా వరి విత్తనాలను వెదజల్లి సాగు చేసే విధానాన్ని వ్యవసాయ వర్సిటీ అభివృద్ధి చేస్తోంది. దీనిపై పరిశోధన కొనసాగుతోందని, త్వరలో రైతులకు అందుబాటులోకి తెస్తామని వర్సిటీ అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం వరి నారు పెంచడానికి కొన్ని రోజులు పడుతుందని, తర్వాత నారు తీసి నాట్లు వేయడానికి సమయం పడుతుందని.. ఇదే సమయంలో కూలీల కొరత, ఖర్చు సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తే బాగుంటుందని, దీనికి డ్రోన్ సాంకేతికతను వినియోగించేలా పరిశోధన చేస్తున్నామని వివరించారు. డ్రోన్‌తో రోజుకు ఏకంగా 30 ఎకరాల్లో ఐదు వరుసల్లో వరి విత్తనాలను వెదజల్లవచ్చని చెప్తున్నారు. దీనివల్ల రైతులకు కూలీల ఖర్చు తగ్గుతుందని, సమయం కలిసివస్తుందని అంటున్నారు. కలుపు మందును కూడా డ్రోన్ల సాయంతో చల్లేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొంటున్నారు.

డ్రోన్లపై శిక్షణ కోసం అకాడమీ

రాష్ట్రంలో నిరుద్యోగులకు, ఆసక్తి కలిగిన వారికి డ్రోన్ల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని.. ఇందుకోసం డ్రోన్ అకాడమీని నెలకొల్పాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. త్వరలోనే దీనిని ప్రారంభిస్తామని.. వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర రంగాల్లో డ్రోన్లను ఎలా వాడాలో శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 60ఏళ్ల మధ్య వయసున్న వారికి శిక్షణ అవకాశం ఉంటుందని.. ఇందుకోసం తప్పనిసరిగా పాస్‌పోర్ట్ ఉండాలని, కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వెల్లడించారు. ఆరు రోజులపాటు సమగ్రంగా శిక్షణ ఇచ్చేందుకు రూ.45 వేలు ఫీజు ఖరారు చేశారు. ప్రధానంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఉంటుంది.

పురుగు మందులు చల్లడంపై ప్రత్యేకంగా..

రాష్ట్రంలో ప్రధానంగా సాగు చేసే వరి, పత్తి, వేరుశనగ, కంది, పొద్దు తిరుగుడు, ఆముదం, సోయాబీన్ పంటల్లో డ్రోన్ల ద్వారా పురుగు మందులను చల్లడంపై ప్రత్యేక శిక్షణ ఉంటుందని వ్యవసాయ వర్సిటీ వెల్లడించింది. దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను రూపొందించింది. ఉదాహరణకు డ్రోన్ల ద్వారా పురుగు మందు చల్లేటపుడు వాటి రెక్కల నుంచి వచ్చే గాలి వేగానికి వరి చేను విరిగిపోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఎంత ఎత్తు నుంచి డ్రోన్లను ఉపయోగించాలి, ఎంత స్థాయిలో మందును విడుదల చేయాలన్నది నిర్ణయించారు.

- ఇక సాధారణ తైవాన్ స్ప్రేయర్ల ద్వారా



పెద్దపల్లి జిల్లాలో క్రిమిసంహారక మందును పిచికారీ చేస్తున్న డ్రోన్ (ఫైల్)

ఎకరా పంటకు పురుగుమందు పిచికారీ చేయాలంటే 150 లీటర్ల నుంచి 200 లీటర్ల నీటిని వాడుతారు. అదే డ్రోన్ల ద్వారా అయితే కేవలం 20 లీటర్లతో పిచికారీ చేయొచ్చు. ఒక రోజులో ఏకంగా 30 ఎకరాల్లో మందును చల్లవచ్చు. ప్రత్యేక పరికరాలను అమర్చడం ద్వారా.. కాండం మొదట్లోకి పురుగు మందు చేరేలా చేయవచ్చు.

- కేంద్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తెచ్చిన నానో యూరియాను కూడా డ్రోన్ల ద్వారా పంటలపై చల్లవచ్చని వ్యవసాయ వర్సిటీ వరి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాంగోపాల్ వర్మ తెలిపారు. పురుగు మందులను తక్కువ వ్యవధిలో, పొదుపుగా, సమర్థవంతంగా చల్లడానికి డ్రోన్లతో వీలవుతుందని వివరించారు.

అదనపు పరికరాలను అమర్చి..

పంటలకు డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగు మందులు చల్లడానికి సంబంధించి అనేక అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఎందుకంటే కొన్ని పంటలకు పైపైన స్ప్రే చేస్తే సరిపోతుంది. మరికొన్నింటికి కాండం మొదట్లో చల్లాల్సి ఉంటుంది. దీనితో పాటు పంట పరిస్థితి ఏమిటి? ఏవైనా చీడపీడలు ఆశించాయా? అన్నది తెలుసుకునేందుకు ఫొటోలు తీయాలి. వాటిని వ్యవసాయాధికారికి పంపాలి. ఈ క్రమంలోనే ఆయా అవసరాలకు అనుగుణంగా డ్రోన్లకు ప్రత్యేక పరికరాలను అమర్చాలని అధికారులు భావిస్తున్నారు. ఇక పంటల పూత, కాత ఎలా ఉంది? దిగుబడి ఏమేరకు వచ్చే అవకాశం ఉంది వంటి ప్రతి అంశాన్ని సూక్ష్మస్థాయిలోనూ పర్యవేక్షించేలా డ్రోన్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్లు

రాబోయే రోజుల్లో గ్రామాల్లో సాగు కోసం డ్రోన్ల వినియోగం పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటివరకు వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా.. ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, దుక్కు దున్నే యంత్రాలు, వరి కోత యంత్రాలు వంటివి ఇవ్వగా.. భవిష్యత్తులో డ్రోన్లను అందజేసేందుకు వ్యవసాయ శాఖ సన్నాహాలు మొదలుపెట్టింది. ఒక్కో డ్రోన్ ధర రూ.10 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. వాటిని ఆగ్రోస్ సేవా కేంద్రాల నిర్వాహకులకు సబ్సిడీపై ఇవ్వాలని యోచిస్తున్నారు.

డ్రోన్ల సాగులో దేశానికే మార్గదర్శకంగా..

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగానికి సంబంధించి తెలంగాణ దేశానికే మార్గనిర్దేశం చేస్తోందని వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. వివిధ పంటల్లో డ్రోన్ల వినియోగం, నిర్వహణకు సంబంధించి జయశంకర్ యూనివర్సిటీ రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక (ఎస్‌ఓపీ)నే కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందని అంటున్నారు.

వ్యవసాయ డ్రోన్ల వినియోగంపై సాధారణ మార్గదర్శకాలివీ..

- నీటి వనరులు, నివాస ప్రాంతాలు, పశుగ్రాసం పంటలు, ప్రజా వినియోగాలు, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ మొదలైన వాటికి దూరంగా డ్రోన్లను వినియోగించాలి.
- డ్రోన్ వాడకానికి సంబంధించి గ్రామ పంచాయతీ, వ్యవసాయ అధికారి కనీసం 24 గంటల ముందుగా అనుమతి ఇస్తారు.
- డ్రోన్ మంచి స్థితిలో ఉందని, సురక్షితంగా ప్రయాణించడానికి సరిపోతుందని ముందే సరిచూసుకోవాలి.
- దానితో పిచికారీ చేసే సమయంలో ఆయా ప్రాంతాల్లోకి జంతువులు, వ్యక్తులు ప్రవేశించకూడదు.
- ఆపరేటర్లు డ్రోన్ ఆపరేషన్, సురక్షితమైన పురుగు మందుల పిచికారీ.. ఈ రెండింటిపై శిక్షణ పొంది ఉండాలి.
- ముందుగానే ప్రతిపాదిత ప్రాంతం, సరిహద్దు, అడ్డంకులు (గోడలు, చెట్లు)ను పరిశీలించి ఆ ప్రకారం డ్రోన్‌ను ఆపరేట్ చేయాలి.
- ప్రభుత్వ సంస్థలు, సైనిక స్థావరాలపై లేదా డ్రోన్లకు అనుమతి లేని జోన్ల మీదుగా ఎగురవేయవద్దు. అనుమతి ఇవ్వని ప్రైవేట్ ఆస్తులపైనా డ్రోన్ ఎగరవేయవద్దు.

నిరుత్సాహపర్చిన

బీసీలకు 'లక్ష' సాయం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆర్భాటంగా ప్రవేశపెట్టిన బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సాయం పంపిణీ పథకం ఆశావహులను తీవ్ర నిరాశకు గురిచేసింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా బీసీ కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద భారీగా దరఖాస్తులు రావడంతో వాటిని పరిశీలించి ప్రతి నెలా 15వ తేదీన విడతల వారీగా సాయం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా తొలివిడత కింద ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక శాసనసభ్యుల చేతుల మీదుగా ఆర్థిక సాయానికి ఎంపికైన వారికి చెక్కులు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు చేసిన యంత్రాంగం చివరకు అరకొరగా.. కేవలం పదుల సంఖ్యలోనే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. చాలా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ పంపిణీ ఊసే లేకపోగా.. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన చోట్ల పరిమితంగా లబ్ధిదారులకు చెక్కులు అందించడంతో ఎంతో ఆశగా సాయంకోసం ఎదురు చూసిన దరఖాస్తుదారులు నిరాశకు గురయ్యారు.

ఎంతమందికి అందాయి..?

బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సాయం కింద రాష్ట్రవ్యాప్తంగా 5.28 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిని మండల స్థాయిలో పరిశీలించి అర్హతలను నిర్ధారించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో అధికారులు వీలైనన్ని దరఖాస్తులను పరిశీలించి జాబితాలను జిల్లా కలెక్టర్లకు అందించారు. తొలివిడత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ డబ్బుతో ప్రతి అసెంబ్లీ సెగ్మెంటుకు సగటున

తొలి విడతలో అరకొరగా సాగిన చెక్కుల పంపిణీ

- పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంపిణీ ఊసే లేదు
- రాష్ట్రవ్యాప్తంగా ఎంతమందికి పంపిణీ చేశారనేదానిపై అస్పష్టత
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుందంటున్న అధికారులు



335 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున సాయం అదించవచ్చని అంచనా వేశారు. కానీ శనివారం మెజార్టీ సెగ్మెంట్లలో ఈ కార్యక్రమమే నిర్వహించలేదని ఆరోపణలు వస్తున్నాయి. అయితే శాసనసభ్యులకు సమయాభావం వల్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహించలేకపోయినట్లు క్షేత్రస్థాయి అధికారులు అధికారులు చెబుతున్నారు. దీంతో 15వ తేదీన జరిగిన కార్యక్రమంలో ఎంత మందికి చెక్కులు పంపిణీ చేశారనే దానిపై అస్పష్టత నెలకొంది. దీంతో మండలాల వారీగా సమాచారాన్ని సేకరించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తొలివిడతలో చేపట్టిన కార్యక్రమంలో పంపిణీ చేసిన చెక్కుల వివరాలపై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుందని చెపుతున్నారు.

అత్యధికం అనర్హులే..!

వెనుకబడిన వర్గాల్లో కులవృత్తులపై ఆధారపడ్డ వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం.. దరఖాస్తులను ఆన్‌లైన్ పద్ధతిలో స్వీకరించింది. దరఖాస్తుల ప్రక్రియకు తక్కువ సమయం ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో అనూహ్య స్పందన వచ్చింది. అధికారులు వాటి పరిశీలనకు ప్రత్యేక విధానాన్ని అమలు చేసినట్లు తెలిసింది. ప్రతి దరఖాస్తుపై పూర్తిస్థాయి పరిశీలన (360 డిగ్రీలు) విధానంలో ఆరా తీసినట్లు చెపుతున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖా స్తుల్లో మూడోవంతు వాటిని తొలివిడత కింద పరిశీలన చేశారు. ఇందులో మెజార్టీ అర్జీదారులు కులవృత్తులపైనే ఆధారపడకుండా ఇతరత్రా వ్యాపకాలు నిర్వహిస్తున్నట్లు వెలుగు చూసింది. అంతేకాకుండా ఆర్థికంగా బాగా ఉన్న వాళ్లు కూడా ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడైంది. చాలా మందికి సొంతంగా నాలుగు చక్రాల వాహనాలు, ఇళ్లు, పొలాలు.. తదితరాలున్నా యని తేలింది. ఆదాయపన్ను చెల్లిస్తున్న వాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఈ క్రమంలో మెజార్టీ దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్లు సమాచారం. మరోవైపు ఎమ్మెల్యేలు ఇచ్చిన జాబితాల ఆధారంగా పరిశీలించిన దరఖాస్తుల్లోనూ ఇదే తరహాలో పలువురు అనర్హతకు గురైనట్లు తెలిసింది. దీంతో తాము సిఫార్సు చేసిన వారి పేర్లు లేనందున చెక్కుల పంపిణీ విషయంలో వారు ఆసక్తి చూపించలేదని తెలిసింది.

జిల్లా వార్తలు

రామాలయంలో 18 నుంచి శ్రావణ మాసోత్సవాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 18 నుంచి అధిక శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఆలయ వైదిక కమిటీ వివరాలు వెల్లడించింది. 18 నుంచి 22 వరకు ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, 22న అమ్మవారికి స్నపన తిరుమంజనం, 25న చిత్తా నక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించనున్నారు. ఆగస్టు 12న సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన, 14న పునర్వసు సందర్భంగా ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం జరపనున్నట్లు వైదిక పెద్దలు తెలిపారు.

గోరింటాకు వేడుకలు



గోరింటాకు వేడుకను ప్రారంభిస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని మామిళ్లగూడెంలో అఖిల భారత బ్రాహ్మణ సంక్షేమ సంఘం మహిళా కమిటీ, ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు గోరంటాకు వేడుకలు నిర్వహించారు. మహిళలంతా సహస్ర నామ పారాయణం చేశారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అన్ని వయసులు వారు కులమతాలకు అతీతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంక్షేమ సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలు పరిమి అనంతలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకునే ఆచారం ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఫణిశర్మ, వల్లూరి రంగారావు, అక్కిరాజు గోపి, పరిమి మాలిక, కొలిపాక జ్యోతి, అంజలి, ధన్వంతరి ఫౌండేషన్ ప్రతినిధులు సోమరాజు శ్రీదేవి, ఆదిరాజు పద్మావతి, ఆదిత్య సరస్వతికుమార్, శశిప్రభ తదితరులు పాల్గొన్నారు.

వెండి పళ్లెం వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన కురిచేటి శ్రీనివాసరావు దంపతులు సుమారు రూ.60 వేలు విలువైన వెండి సహస్ర ధార పళ్లెంను శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి వితరణ చేశారు. ఆదివారం ఈఓ రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి దంపతులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపై మీన మేషాలు

- సౌకర్యాలకు నోచుకోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం
- శిథిలావస్థకు చేరిన 40 ఏళ్ల నాటి భవనం
- వసతుల లేమితో తగ్గుతున్న చేప పిల్లల ఉత్పత్తి
- పట్టించుకోని అధికారులు

వైరా: జిల్లాలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంగా పేరొందిన మత్స్య విత్తన కేంద్రం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. జిల్లాలో స్వయంగా చేప పిల్లలను ఉత్పత్తి చేసే ఏకైక కేంద్రం వైరాలో మాత్రమే ఉన్నది. అలాంటి కేంద్రంపై పాలకులు సవతి తల్లి ప్రేమ కనబరుస్తుండటంతో దానిఅభివృద్ధి రోజురోజుకూ కుంటుపడుతోంది. ఇక్కడ చేప పిల్లల ఉత్పత్తి ఘనంగా ఉన్నప్పటికీ సౌకర్యాలు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. ఈ కేంద్రంలో సరిపడా సిబ్బంది లేరు. నీటి సరఫరా పైపులైన్ లీకేజీల మయమైంది. హేచరీ గది శిథిలావస్థకు చేరింది. దీంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కళ తప్పింది. వాస్తవానికి ఇక్కడ ఐదుగురు ఫిషర్ మెన్ ఉండాలి. కానీ ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారు. చేపపిల్లల సంతానోత్పత్తికి జూలై, ఆగష్టు మాసాలే అనువైనవి. ఉత్పత్తి చేసిన చేప పిల్లలను స్పాన్‌గా మారుస్తారు. ఈ కేంద్రంలో బంగారు తీగ, బొచ్చ, కట్ల, రోహూ, గంబూషీయా వంటి చేప పిల్లలను ఉత్పత్తి చేస్తారు. ఈ కేంద్రాన్ని పట్టించుకోకపోవడంతో ఉత్పత్తి సామర్థ్యం పూర్తిగా తగ్గిపోతోంది.

ముంచుకొస్తున్న సీజన్..

చేప పిల్లల ఉత్పిత్తి ప్రక్రియను జూన్ మొదటి వారం నుంచే ప్రారంభిస్తారు. వాతావరణం అనుకూలించకపోవటంతో జూలై చివరి వరకు కూడా ఉత్పత్తి ప్రారంభం కాలేదు. ముందుగా వివిధ చెరువుల నుంచి తల్లి చేపలను తీసుకొచ్చి ఇంజెక్షన్ వేస్తారు. అక్కడి నుంచి వచ్చిన గుడ్లను హేచరీలో స్పాన్ తయారు చేసి చేప పిల్లలను ఉత్పత్తి చేస్తారు. ఇదంతా జూన్ నుంచి ఆగస్టు రెండో వారం వరకు పూర్తి చేయాలి. ఇలా ఉత్పిత్తి అయిన చేప పిల్లలను ఉచితంగా వివిధ మత్స్య సహకార సంఘాలకు సరఫరా చేస్తారు.

దిగుమతి అవసరమే ఉండదు..

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై నిర్లక్ష్యం వదిలి అభివృద్ధిపై దృష్టిని సారిస్తే ప్రభుత్వం ఇతర ప్రాంతాల నుంచి చేప పిల్లలను దిగుమతి చేసుకునే అవసరమే ఉండదు. పూర్తిస్థాయి చేప పిల్లల ఉత్పత్తి జరిగితే ఉమ్మడి జిల్లాలోని చెరువులకు సరఫరా చేయవచ్చు. కానీ, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై పాలకులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా స్పందించి సకాలంలో చేప పిల్లలు ఉత్పిత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

శిథిలావస్థలో హేచరీ గది..

తల్లి చేపలను తీసుకొచ్చి గుడ్లను హేచరీలో స్పాన్‌గా మారుస్తారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంతో పాటే నిర్మించిన హేచరీ గది ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో గది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైపులు మధ్యలో లీకవుతుండడంతో హేచరీలకు నీరు సరఫరా కావడం లేదు. బాయిల్డ్ పరికరాలు మొత్తం తుప్పుపట్టిపోయాయి. హేచరీ గది సరిగా లేకపోవడంతో ఉత్పిత్తికి ప్రతి సంవత్సరం ఆటంకం ఏర్పడుతోంది.

ఇవీ ప్రధాన సమస్యలు..

మత్స్య విత్తన కేంద్రంలో 38 సిమెంట్ పాండ్‌లు ఉండగా 8 పనిచేయటం లేదు. మరో 5 పాండ్లకు లైనింగ్ లేకపోవటంతో నీళ్లు నిలిచే పరిస్థితి లేదు.



శిథిలావస్థలో ఉన్న మత్స్య విత్తన కేంద్రం కార్యాలయం



లైనింగ్ లేక నీళ్లు నిలవని చేపల పాండ్

మత్స్య విత్తన కేంద్రంవివరాలు..

మొత్తం సొసైటీలు	: 55
సభ్యులు	: 6,000
చెరువులు	: 100
గ్రామ పంచాయతీ చెరువులు	: 393
ఈ ఏడాది చేప పిల్లల లక్ష్యం ఒక్కో రకం :	4.75 లక్షలు
గంబూషీయ చేప పిల్లలు	లక్ష

పైప్ లైన్‌లు లీకేజీ, ఓ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణంతో పాటుగా ఆధునిక పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మోటార్ కూడా సక్రమంగా పనిచేయటం లేదు. ప్రధానంగా ప్రహరీ లేకపోవటంతో ఇక్కడి ఖాళీ స్థలం కూడా ఆక్రమణకు గురవుతోంది. వాచ్ మెన్ లేకపోవటం ఇబ్బందిగా మారింది. 45 ఏళ్ల క్రితం నిర్మించిన కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో కురుస్తూనే ఉంటుంది.

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు చేశాం..



చేప పిల్లల కేంద్రంలో సరైన వసతులు లేక పిల్లల ఉత్పత్తికి ఇబ్బందిగానే ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. హేచరీ గది శిథిలావస్థలో ఉండటంతో పూర్తి స్థాయి ఉత్పిత్తి చేపట్టలేకపోతున్నాం. దీనిపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా చేశాం.

– అంజనేయస్వామి, ఫిషరీస్ ఏడీ ఖమ్మం

'కస్తూర్బా' ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బోనకల్: కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, పీఆర్సీ కమిటీ సూచించినట్టుగా సంవత్సరానికి రూ.1000 ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి టీచర్లను పర్మనెంట్ చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న చేపట్టే 'చలో ఎస్‌పీడీ ఆఫీస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ, రాణి, కమల వాహిణి, శైలజ, వసుంధర, కవిత, రత్నమాల, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గాభవాని

'స్వచ్ఛత'లో ఉత్తమ ఏరియాల ఎంపిక

- ప్రథమ స్థానంలో శ్రీరాంపూర్, మణుగూరుకు రెండో స్థానం
- వివరాలు వెల్లడించిన జీఎం గణపతి

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా జూన్ 16 నుంచి 30 వరకు చేపట్టిన స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ప్రథమ స్థానంలో నిలిచిందని, మణుగూరు ఏరియా రెండో స్థానం దక్కించుకుందని సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం జీవీఎల్ గణపతి తెలిపారు. స్థానిక సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆర్జీ–2, కార్పొరేట్, బెల్లంపల్లి ఏరియాలు ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు, శుభ్రమైన నిర్మాణం, పర్యావరణ సమతుల్యత, మొక్కలు నాటడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం తదితర కార్యక్రమాలపై అన్ని ఏరియాల్లోని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో నిర్వహించిన స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. వీటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆరుగురు సభ్యులు గల కమిటీ పరిశీలించి ఉత్తమ ఏరియాలను ఎంపిక చేశాయని తెలిపారు. కార్యక్రమంలో పర్సనల్ జీఎం కట్టా బసవయ్య, ఎడ్యుకేషన్, హెచ్‌ఆర్‌డీ జీఎంలు వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఏసీఎంఓ సుజాత, ఏజీఎం కోడూరి శ్రీనివాసరావు, ఎస్‌ఈ సివిల్ రాజేశ్వరరావు, డిప్యూటీ మేనేజర్ ఫజుల్ రహమాన్, కమ్యూనికేషన్ సెల్ ఇన్‌చార్జ్ శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం గణపతి

విరబూసిన బ్రహ్మకమలం

సత్తుపల్లిరూరల్: శీతల ప్రాంతాల్లో కనిపించే అరుదైన బ్రహ్మ కమలాలు సత్తుపల్లి మండలం గంగారంలో వికసించి కనువిందు చేస్తున్నాయి. సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన జగ్గవరపు దామోదర్‌రెడ్డి ఇంట్లో ఈ అరుదైన బ్రహ్మ కమలం మొక్క పెంచుతున్నారు. అయితే ఈ మొక్కకు పది రోజుల క్రితం ఏడు మొగ్గలు వచ్చాయి. వాటిలో శనివారం రాత్రి నుంచి ఐదు మొగ్గలు వికసించగా స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఈ నేపథ్యంలో దామోదర్‌రెడ్డి కుటుంబ సభ్యులు బ్రహ్మకమలం మొక్క కు పూజలు నిర్వహించారు. శివుడికి ప్రీతి పాత్రమైన పుష్పంగా పురాణాలు చెబుతున్నాయని, ఏడాదిలో ఒకసారి మత్రమే.. అది కూడా రాత్రి వేళల్లో ఈ పువ్వు పూస్తుందని అంటున్నారు. రాత్రి వేళలో శ్వేత వర్ణంలో పెద్దగా వికసించే ఈ పూలు ఉదయానికి మొగ్గలా ముడుచుకుంటాయి. ఈ పుష్పాలను దేవునికి పూజకు వినియోగిస్తామని దామోదర్‌రెడ్డి తెలిపారు.



వికసించిన బ్రహ్మకమలం పూల చెట్టు వద్ద దామోదర్‌రెడ్డి దంపతులు (ఇన్‌సెట్) పూజకు సిద్ధం చేసిన పూలు

కిన్నెరసానిలో కోలాహలం

భారీగా తరలివచ్చిన పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం బోట్ షికారు చేశారు. పర్యాటకుల రాకతో ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. మొత్తం 656 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.23,345, 300 మంది బోటింగ్ చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ. 18,050 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



బోటింగ్ చేస్తున్న కేటీపీఎస్ సీఈ ప్రభాకర్‌రావు

కేటీపీఎస్ సీఈ రాక..

కేటీపీఎస్ 5వ దశ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావుతో పాటు శ్రీశైలం హైడల్ విద్యుత్ కేంద్రంలో ఎస్‌ఈగా విధులు నిర్వహిస్తున్న సద్గుణకుమార్ ఆదివారం కిన్నెరసానిని సందర్శించారు. జలాశయాన్ని వీక్షించిన తర్వాత రిజర్వాయర్‌లో బోటింగ్ చేశారు.